క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రానికి ఫ్యాన్ బహూకరణ


ఫ్యాన్ అందజేస్తున్న దాతలు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి గ్రామానికి చెందిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి స్వచ్ఛంద సేవా సమితి గురువారం సీలింగ్ ఫ్యాన్ అందించారు. చిన్నారులు ఇబ్బంది పడుతున్నారని సీలింగ్ ఫ్యాన్ అందజేశామని దాతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో దాసరి కనకయ్య, దాసరి రవిశాస్త్రి, మహేశ్, సాయి కుమార్, మల్లేశం,నరసయ్య, సురేందర్ ప్రవీణ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్స్ యూనియన్ ఎన్నిక

చొప్పదండి: చొప్పదండి మండల ఫొటో, వీడియోగ్రాఫర్స్ యూనియన్ నూతన అధ్యక్షుడిగా బొడిగె అజయ్‌కుమార్ ఉపాధ్యక్షుడిగా నాంపెల్లి నరేశ్, ప్రధాన కార్యదర్శిగా తెలుకుంట వేణు, కోశాధికారిగా సామల కిషోర్, ప్రచార కార్యదర్శిగా పెద్దెల్లి శ్యామ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రీనివాస్, శివకుమార్, సుధాకర్, విశ్వమోహన్, చంద్రశేఖర్ ముఖ్య సలహాదారులుగా నియామకమయ్యారు.

చేవెళ్ల సభకు తరలిరావాలి

చొప్పదండి: రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో 23న నిర్వహించే బీజేపీ సభకు విద్యార్థులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో తరలిరావాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో కోరారు. కేవీఆర్ గార్డెన్స్‌లో జరిగే సభకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరవవుతారని తెలిపారు. నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటమాడుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ మేళా

వీణవంక: అంగన్‌వాడీ సెంటర్లలో అన్నిమౌలిక వసతులు ఉన్నాయని, చిన్నారులను కేంద్రాల్లో చేర్పించాలని సీడీపీవో భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని హిమ్మత్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ మేళా నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం సీడీపీవో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా కేంద్రాలలో విద్యా బోధన జరుగుతోందని, గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందుతోందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శారద, లావణ్య, స్వరూప, ఆయాలు సమ్మక్క, వీరమ్మ ఉన్నారు.

ఎమ్మెల్యే ఈటల ఔదార్యం

వీణవంక: మండలంలోని శ్రీరాములపేట గ్రామానికి చెందిన 60మందిని హైదరాబాద్‌లోని ఆర్‌వీఎం ఆసుపత్రికి ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆదేశాలతో చికిత్స నిమిత్తం పంపించామని బీజేపీ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతంరెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని పేదలకు ఈటల అండగా ఉంటున్నారని, తనవంతు సాయంగా కార్పొరేట్ ఆసుపత్రిలో ఉచిత వైద్యం అందించి ఉదారత చాటుకుంటున్నారని పేర్కొన్నారు. అన్నిరకాల వైద్య పరీక్షలు, చికిత్సలు ఉచితంగా చేయిస్తున్నారని, ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజల తరుపున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సంధ్యారాణి, ఉపసర్పంచ్ దామోదర్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి మారం తిరుపతిరెడ్డి ఉన్నారు.

ప్రొసీడింగ్ కాపీ అందజేత


ప్రొసీడింగ్ అందుకుంటున్న చంద్రమౌళి

మానకొండూర్: మండలంలోని కొండపల్కల గ్రామానికి చెందిన సైండ్ల శ్రీకాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, బీఆర్‌ఎస్ సభ్యత్వం ఉన్నందున మృతుడి తండ్రి చంద్రమౌళికి తెలంగాణ భవన్‌లో రూ. రెండు లక్షల ప్రొసీడింగ్ కాపీ అందజేశారు. కార్యక్రమంలో రైతుబంధు కన్వీనర్ కదారి ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

‘కంపోస్ట్’ తయారీ ఎప్పుడో..!

- సెగ్రిగేషన్‌షెడ్లలో తయారుకాని వర్మీ కంపోస్టు
- చెత్త సేకరణకే పరిమితమైన జీపీలు
- 3 గ్రామాల్లో మాత్రమే ఎరువుతయారీ
- మిగిలిన గ్రామాల్లో డంపింగ్‌యార్డుకే చెత్త తరలింపు


రేకొండలో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాల్లో ఇళ్ల నుంచి చెత్తాచెదారం తొలగించేందుకు ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీకి ట్రాక్టర్ ఏర్పాటు చేసింది. పారిశుధ్య సిబ్బంది రోజూ ఇంటింటి నుంచి సేకరించి చెత్తను ట్రాక్టర్ల ద్వారా డంపింగ్‌యార్డ్‌కు తరలిస్తున్నారు. అక్కడ తడి, పొడి చెత్తను వేరుచేయడం, వర్మీ కంపోస్ట్ ఎరువును తయారు చేస్తున్నారు. ఈ కంపోస్ట్ ఎరువును స్థానికంగా ఉండే నర్సరీల్లో మొక్కలకు వినియోగిస్తున్నారు. గ్రామానికో డంపింగ్‌యార్డు, సెగ్రిగేషన్ షెడ్డును ప్రభుత్వం నిర్మించింది. పక్కనే సెగ్రిగేషన్ (వర్మీ కంపోస్ట్ తయారీ) షెడ్డులను నిర్మించింది. ట్రాక్టర్ల ద్వారా గ్రామాల్లో చెత్త డంపింగ్‌యార్డులకు తరలిస్తున్నా చాలా గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేరు చేయడం లేదు. దీంతో వర్మీ కంపోస్ట్ ఎరువు తయారు కావడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చెత్తను డంపుయార్డుకు తరలించి ప్రచారం వదిలేస్తున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి.

నెరవేరని ప్రభుత్వ ఆశయం

వర్మీ కంపోస్ట్ తయారు చేయాలనే ప్రభుత్వ సంకల్పం క్షేత్రస్థాయిలో నెరవేరడం లేదు. గ్రామ పంచాయతీ పాలకవర్గాలు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ ఆశయం కొనసాగడం లేదు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సైతం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

మూడు గ్రామాల్లోనే తయారీ

మండలంలోని ముదిమాణిక్యం, లంబాడిపల్లి, కొండాపూర్ గ్రామాల్లో మాత్రమే వర్మీ కంపోస్ట్ ఎరువు తయారవుతోంది. మిగిలిన గ్రామాల్లో ట్రాక్టర్ల ద్వారా సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డులకు తరలించి కాల్చివేస్తున్నారని సమాచారం. ఏది ఏమైనా గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రధాన భూమిక పోషించాల్సి ఉన్నా వారు ఫొటో దిగి యాప్‌లో అప్‌లోడ్ చేసేందుకే పరిమితమవుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

సంపూర్ణ పారిశుధ్యంతో గ్రామాలు అభివృద్ధి

గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్య పనులు చేపట్టడంతో గ్రామాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతాయనే సదుద్దేశంతో ప్రభుత్వం గ్రామానికో ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసింది. గ్రామాల్లో వారానికి రెండ్రోజులు చెత్తను సేకరిస్తున్నా కంపోస్ట్ ఎరువు తయారు చేయడం లేదు.


చెత్తను ట్రాక్టర్‌లో వేస్తున్న పారిశుధ్య సిబ్బంది

రోజూ చెత్త సేకరిస్తున్నాం



రోజూ చెత్తను సేకరిస్తున్నాం. సేకరించిన చెత్తను వేరు చేసి వర్మీ కంపోస్ట్ ఎరువుగా తయారు చేస్తున్నాం. అలా తయారు చేసిన ఎరువును స్థానికంగా పెంచుతున్న నర్సరీలకు వాడుతున్నాం. ఇప్పటి వరకు ఐదు విడతలుగా ఎరువు తయారు చేశాం. – వెంకటరమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, ఇందుర్తి

ఎరువు మొక్కలకు వాడుతున్నాం



గ్రామంలో ప్రతి పదిహేను రోజులకోసారి చెత్తతో ఎరువును తయారు చేస్తున్నాం. తయారైన ఎరువును నర్సరీల్లోని మొక్కలకు వాడుతున్నాం. తడి చెత్తలో మట్టిపోసి నీరు పట్టి ఆకులు కప్పితే ఎరువు తయారవుతోంది. ఎరువును మొక్కలకు వాడుతున్నాం. – సన్నీల్ల వెంకటేశం, సర్పంచ్, గాగిరెడ్డిపల్లి

అన్నిషెడ్లలో వర్మీ కంపోస్ట్ తయారు



మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్మించిన సెగ్రిగేషన్‌షెడ్లలో వర్మీ కంపోస్ట్ ఎరువును తయారు చేస్తున్నాం. ఇప్పటివరకు ఐదు నుంచి ఆరు విడతలుగా ఉత్పత్తి చేశాం. నర్సరీల్లోని మొక్కలకు వాడుతున్నాం. ఇటీవల కొందరు రైతులకు విక్రయించాం. – శ్రవణ్‌కుమార్, మండల పంచాయతీ అధికారి, చిగురుమామిడి

అగ్నిప్రమాదాల నివారణపై ప్రచారం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చొప్పదండి: అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక శాఖ సిబ్బంది గురువారం చొప్పదండిలోని వ్యాపార సముదాయాల్లో ప్రచారం నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా చివరి రోజు రైస్‌మిల్లులు, హోటళ్లు, పెట్రోల్ బంకులు, ఇతర వాణిజ్య ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ముంబైలోని అనంతరం మృతిచెందిన అగ్నిమాపక సిబ్బందికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా ప్రభుత్వం


ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్


హుజూరాబాద్ పట్టణంలో..

మానకొండూర్: ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ముస్లింలకు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాట్లాడారు. షాదీ ముబారక్‌తోపాటు అనేక కార్యక్రమాలు సాధ్యమైనంత వరకూ అమలు చేస్తున్నామని అన్నారు. మానకొండూర్‌లోని షాదీఖానాసమస్య తొలగిపోయిందని జూన్ వరకూ పనులు పూర్తవుతాయన్నారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ జీవీ రామక్రిష్ణారావు, జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, ఉప సర్పంచ్ నెల్లి మురళీ, నాయకులు ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి, నెల్లి శంకర్, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, దండబోయిన శేఖర్ ముస్లిం పెద్దలు, పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని మోమిన్ పురాలోని మస్జిద్-ఎ-బషీర్‌లో గురువారం హీరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మస్జిద్-ఎ-బషీర్ మత గురువు ఇమ్రాన్ బేగ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మజ్లిస్-ఉల్-ఉలమా ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముఫ్తి మహ్మద్ ఫియాస్, మొహియుద్దీన్, కౌన్సిలర్ ప్రతాప తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ప్రతాప తిరుమల్ రెడ్డి మాట్లాడుతూ.. ముస్లింల శ్రేయస్సు కోసం హీరా ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మస్జిద్-ఎ-బషీర్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, అబ్బు, ఫయాజ్, యూసుఫ్, అషు, సలీం తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మున్సిపల్ చైర్మన్


శుభాకాంక్షలు తెలుపుతున్న రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఆయన నివాసంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ సద్వినియోగం చేసుకోవాలి


శిబిరాన్ని ప్రారంభిస్తున్న గందె రాధిక

హుజూరాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక కోరారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 20వ వార్డులో రాధాస్వామి సత్సంగ్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కొలిపాక నిర్మల, కౌన్సిలర్లు గనిశెట్టి ఉమామహేశ్వర్, తాళ్లపల్లి శ్రీనివాస్, నాయకులు కొలిపాక శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

వీణవంక: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని వల్బాపూర్ గ్రామంలో రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. కంటి సమస్యలు ఉన్నవారు పరీక్షలు చేసుకోవాలని సూచించారు. వెంట ఉపసర్పంచ్ కవితాశ్రీనివాస్, ఎంపీటీసీ జీడి దేవేందర్, పోరెడ్డి తిరుపతిరెడ్డి, జీడీ వెంకటస్వామి, రాజు, విజేందర్, కార్తీక్, సమ్మయ్య, ఐలయ్య, వైద్యులు రవీందర్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: బీఆర్‌ఎస్ కార్యకర్తలే బలం, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్‌లో నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. 25న నిర్వహించే పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలపై మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు దళారుల ప్రమేయం లేకుండా ప్రజలకు అందుతున్నాయన్నారు. ప్రతిపక్షాల కుట్రలు కలిసికట్టుగా ఎదుర్కోవాలన్నారు. దేశంలోనే ఎక్కడాలేని విధంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారని జోస్యం చెప్పారు. సమావేశంలో జెడ్పీ చైర్పర్సన్ కనుమల్ల విజయ, నియోజకవర్గంలోని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, అన్ని మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, రైతు సమన్వయ సమితి సభ్యులు, పార్టీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేలం వాయిదా

చొప్పదండి: పట్టణంలోని అంగడిబజార్‌లో ప్రతి శుక్రవారం నిర్వహించే కూరగాయల సంతకు నిర్వహించాల్సిన వేలం వాయిదా వేశామని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ తెలిపారు. ఒకే టెండర్ దాఖలు కావడంతో వాయిదా వేశామని, ప్రస్తుతం సంతలో ఫీజులను మున్సిపల్ సిబ్బంది ద్వారా వసూలు చేయిస్తున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి ప్రతి శనివారం నిర్వహించే మేకలు, గొర్రెల వారసంతకు గురువారం నిర్వహించిన వేలం పట్టణానికి చెందిన తాళ్లపల్లి రవి రూ.7.30 లక్షలకు దక్కించుకున్నారు. కమిషనర్ చాంబర్‌లో వేలం పాట నిర్వహించారు.

విద్యుత్ మోటార్ చోరీ

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామశివారులో ఎస్సారెస్పీ ఉపకాలువకు బిగించిన విద్యుత్ మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని బాధితుడు గూళ్ల శ్రీనివాస్ కేశవపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురువారం యాసంగి వరి పంటకు నీటి తడులు అందించేందుకు ఉదయం మోటారు పెట్టేందుకు వెళ్లగా కాలువకు బిగించిన మోటార్ కనిపించలేదని వాపోయాడు.

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు


గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులందిస్తున్న రమాదేవి

ఇల్లందకుంట: మండలంలోని కేజీబీవీలో గురువారం శ్రీశివరుద్రయూత్ వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గుత్తికొండ పవన్, నెహ్రూయువకేంద్ర కరీంనగర్ ఆధ్వర్యంలో జలశక్తి అభియాన్ విద్యార్థినులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విజేతలకు ఎస్‌వో రమాదేవి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఎస్‌వో మాట్లాడుతూ మానవాళికి నీరు జీవనాధారం, వృథా చేయకుండా భవిష్యత్ తరాలకు నీరు సమృద్ధిగా అందేలా పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యువజనసంఘం నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ బస్టాండ్‌లో గురువారం గ్రామంలోని యువత ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఏటా వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీరుస్తామని మచ్చ రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో గొల్ల గట్టయ్య, మొగిలి సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం


పంచాయతీ కార్మికులను సన్మానిస్తున్న జితేందర్, తదితరులు

రామడుగు: మండలంలోని చిప్పకుర్తి గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులను బీజేపీ మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడు చంటి జితేందర్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమానికి రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు పారిశుధ్య కార్మికులకు ఇస్తున్న వేతనం కుటుంబ పోషణకు సరిపోవడం లేదని, రూ.19,500లకు వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జుట్టు లచ్చయ్య, నాయకులు మాడిశెట్టి జయంత్, లక్ష్మిరాజం, దుర్గం అంజనేయులు, నాగుల వెంకటేశ్‌గౌడ్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తాపీ కార్మిక సంఘం వార్షికోత్సవం


సీనియర్ తాపీ కార్మికులను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలో నేతాజీ తాపీ కార్మిక సంఘం వార్షికోత్సవాలను సంఘం అధ్యక్షుడు బిట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్‌ఎస్ నాయకుడు, కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య హాజరై మాట్లాడారు. గృహ నిర్మాణంలో తాపీ కార్మికుల కృషి గొప్పదని, సంఘం నలభై ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీనియర్ కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి శనిగరపు తిరుపతి, వెంకట్‌రెడ్డి, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులకు మోటార్ సైకిళ్లు పంపిణీ చేయాలి


ఇల్లందకుంటలో మాట్లాడుతున్న రావుల ఎల్లయ్య, తదితరులు

ఇల్లందకుంట: భవన నిర్మాణ కార్మికుల కోసం బడ్జెట్‌లో ప్రకటించిన లక్ష మోటార్ సైకిళ్లను ప్రభుత్వం వెంటనే పంపిణీ చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం ఇల్లందకుంట మండల అధ్యక్షుడు రావుల ఎల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. భవన కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలను అమలు చేసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో గోలి కృష్ణమూర్తి, రేణుకుంట్ల సారయ్య, వెంకన్న, మల్లేశ్, రాములు, రాజయ్య,గణపతి, రజనీకాంత్, స్వామి, శ్రీనివాస్, కుమారస్వామి, రాజ్‌మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వృద్ధురాలి ఆత్మహత్య

జమ్మికుంట: అనారోగ్యంతో బాధపడుతూ ఓ వృద్ధురాలు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పట్టణ సీఐ బొర్పటి రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెంకు చెందిన పొనగంటి రాజ్యలక్ష్మి (70) కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో మనస్తాపానికి గురై గురువారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుంది. మృతురాలికి ముగ్గురు కుమారులుండగా ఓ కుమారుడు మృతిచెందాడు. ఇద్దరు కుమారులకు వివాహాలయ్యాయి. మృతురాలి భర్త డాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఈద్గాలో పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని ఈద్గాలో రంజాన్ సందర్భంగా పరిశుభ్రత పనులను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. అనంతరం మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంటలో కంటి వెలుగు శిబిరాన్ని, కొత్తపల్లిలో వైకుంఠధామం పనులను సందర్శించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని, అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎన్విరాల్‌మెంట్ ఇంజినీరు శ్రీకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సదానందం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేత


సునీల్‌రావుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న చైర్మన్, అర్చకులు

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామం శ్రీ మానసాదేవి ఆలయ వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను కరీంనగర్ మేయర్ సునీల్‌రావుకు గురువారం ఆలయ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు మామిడాల నాగసాయిశర్మ అందజేశారు. మేయర్ స్వగృహంలో కలిసి 30 నుంచి మే 4వ తేదీ వరకు వార్షికోత్సవాలు నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ డెయిరీ డైరెక్టర్ తిరుపతిరెడ్డి, ఆలయ డైరెక్టర్ రవీందర్ పాల్గొన్నారు.